క్లుప్తంగా

దుర్గమ్మ రథయాత్రకు స్వాగతం


దుర్గమ్మ రథం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కొమ్మాది: విజయవాడ కనకదుర్గమ్మ రథయాత్ర జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడ వద్దకు సోమవారం సాయంత్రం చేరుకుంది. ఈ సందర్భంగా భవానీ మాలధారులు, స్థానిక కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కె.నగరపాలెం, నరసింహనగర్ వద్ద స్థానిక నాయకుడు దోని నాగరాజు ఆధ్వర్యంలో కుంకుమ పూజలు, ఛండీయాగం నిర్వహించారు. అనంతరం రథయాత్ర విజయనగరం పయనమైంది.

దుస్తులు పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న వెంపాడ శ్రీనివాసరెడ్డి

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్టకు చెందిన సీయోను ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం శ్రీనగర్‌లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పాస్టర్ స్టీఫెన్, కె.రాజు క్రీస్తు గొప్పతనాన్ని వివరించగా ప్రవీణ్, సన్నీ బ్రదర్స్ వాక్యోపదేశం చేశారు. చిన్నారులు క్రీస్తు వేషధారణతో ఆయన జీవిత చరిత్ర వివరించారు. అనంతరం విజయనగరం ప్రేమవెలుగు బాలల సంరక్షణ కేంద్రంలో గిరిజన చిన్నారులకు అంకిత రెడీమేడ్స్ యజమాన్యం రాజేష్ అందించిన దుస్తులను వెంపాడ శ్రీనివాసరెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాకబ్, హెల్డర్, పి.రవి, జి.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేతి బోరు ప్రారంభం


బోరు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొండబాబు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డులో రెండు చోట్ల చేతి పంపు బోర్లను కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు ప్రారంభించారు. కె.నగరపాలెం సచివాలయం – 2 పరిధిలో గల చేపల తిమ్మాపురం, నిడిగట్టు సచివాలయం పరిధిలో గల నేరెళ్లవలస గ్రామంలో ఏర్పాటు చేసిన రెండు బోర్లను సోమవారం అందుబాటులోకి తీసుకొచ్చారు. గతంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస్ దృష్టికి స్థానికులు మంచినీటి సమస్య తీసుకొచ్చారని, ఆ సమస్యకు పరిష్కారంగా ఈ బోర్లు ప్రారంభించినట్లు కొండబాబు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మేరుగు చిన్నారావు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో పతకాలు


కిక్ బాక్సింగ్‌లో పతకాలు సాధించిన హరి కోచింగ్ సెంటర్ విద్యార్థులు

తగరపువలస: ఈ నెల 17న విశాఖలో జరిగిన నేషనల్ కిక్ బాక్సింగ్ పోటీల్లో తగరపువలస ఏకే – 1 హరి కోచింగ్ సెంటర్ విద్యార్థులు పతకాలు సాధించారు. వీరిలో బి.బలరాం(17), కె.వంశీ(18), ఎస్.అప్పల పైడిరాజు(17), తాళ్లవలసకు చెందిన కోరాడ రవితేజ(17), కోరాడ యశ్వంత్‌రాజ్(16)కు బంగారు పతకాలు లభించాయి. అలాగే కె.చైతన్య(14)కు బ్రాంజ్, కె.ప్రవీణ్‌కుమార్(14)కు సిల్వర్ పతకాలు లభించాయి. వీరిని నిర్వాహకులతోపాటు కోచ్ అర్జి హరి అభినందించారు.

కల్యాణ కాంతులు


మద్ది గ్రామంలో నూతనంగా నిర్మించిన ఫంక్షన్ హాల్



- రూ.10 లక్షలతో **కల్యాణ మండపం ఆధునికీకరణ**
- రూ.40 లక్షలతో ఫంక్షన్ హాల్ నిర్మాణం
- తాగునీటి కోసం ఆర్‌వో ప్లాంటు ఏర్పాటు

పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామంలో వివాహాది శుభకార్యాలు చేసుకునేందుకు గతంలో నిర్మించిన కల్యాణ మండపాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో సుందరంగా ఆధునికీకరించారు. దానికి అనుబంధంగా కొత్తగా ఫంక్షన్ హాలు కూడా నిర్మించారు. ఇందుకోసం మొత్తంగా రూ.50 లక్షలు వెచ్చించారు. గతంలో ఇళ్ల ముందు వివాహాది శుభకార్యాలు చేసుకోవడానికి విశాలమైన స్థలాలు కొరవడడంతో ఇబ్బందులు పడేవారు. తప్పనిసరి పరిస్థితుల్లో కొంతమంది ఇరుకు సందుల్లోనే శుభకార్యాలు చేసుకునేవారు. మరికొంత మంది పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో శుభకార్యాలు చేసుకోవడానికి వచ్చేవారు. ఈ నేపథ్యంలో మద్ది ప్రజలు వివాహాది శుభకార్యాలు చేసుకోవడానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక **ఎంపీపీ కంటుబోతు రాంబాబు** కృషితో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో పాత కల్యాణ మండపాన్ని ఆధునికీకరించారు. ఇందుకోసం మండల పరిషత్ జనరల్ నిధులు రూ.10 లక్షలు కేటాయించారు. వివాహం చేసుకోవడానికి వేదిక నిర్మించారు. వధువు, వరుడి కోసం వేర్వేరుగా గదులు నిర్మించారు. పైన, లోపలి భాగాలను రంగులు, హంగులతో తీర్చిదిద్దారు. లోపల భాగం విద్యుత్‌దీపాలు, రంగులతో చూడముచ్చటగా కనిపిస్తోంది. దీనికి అనుసంధానంగా పక్కనే భోజనాలు పెట్టుకునేందుకు వీలుగా రూ.40 లక్షలతో ఫంక్షన్ హాలు నిర్మించారు. ఎంపీ నిధులు రూ.10 లక్షలు, మండల పరిషత్ జనరల్ నిధులు రూ.20 లక్షలు, జెడ్పీ జనరల్ నిధులు రూ.5 లక్షలు, గ్రామ పంచాయతీ జనరల్ నిధులు రూ.5లక్షలతో ఈ ఫంక్షన్ హాలు నిర్మించారు. ఆర్‌వో వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశారు. తాగడానికి, చేతులు శుభ్రపరచుకునేందుకు కుళాయిలు నిర్మించారు.


వరుడు కోసం నిర్మించిన గది


ఫంక్షన్ హాల్లో నిర్మించిన కుళాయిలు


కల్యాణ మండపం లోపలి భాగం


మద్ది గ్రామంలో ఆధునికీకరించిన కల్యాణ మండపం

అందుబాటులో కల్యాణ మండపం



వివాహాది శుభకార్యాలు చేసుకోవడానికి తమ గ్రామంలోనే అన్ని సౌకర్యాలతో కల్యాణ మండపాన్ని ఆధునికీకరించారు. దాని పక్కన ఫంక్షన్ హాలు నిర్మించారు. ఇక్కడ వివాహాలు, ఇతర శుభకార్యాలు చేసుకోవడానికి అనువుగా ఉంది. తాగునీటి సౌకర్యం కల్పించారు. కుళాయిలు నిర్మించారు.

– కె.ప్రకాష్, మద్ది

గతంలో పద్మనాభం వెళ్లేవారు



ఇంటి వద్ద వివాహాలు చేసుకోవడానికి స్థలాలు లేని వారు పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలోకి వెళ్లేవారు. ప్రస్తుతం తమ గ్రామంలోనే విశాలమైన కల్యాణ మండపం ఉండడంతో పద్మనాభం వెళ్లే బాధలు తప్పాయి. సకల సౌకర్యాలతో కల్యాణ మండపం ఆధునికీకరించడం సంతోషకరం.

– కె.సలోమి, మద్ది

కనులపండువగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం


చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయంలో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు


కోరాడలో కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు


బక్కన్నపాలెం రోడ్డులోని శ్రీ శృంగేరీ శంకర మఠంలోని సుబ్రహ్మణ్యస్వామి

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయంలో అర్చకుడు ఆకెళ్ల రవిగణేష్ ఆధ్వర్యంలో సోమవారం శ్రీవల్లి, దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. కల్యాణ వేడుకల కోసం విజయనగరం నుంచి అర్చకులు ఓరుగంటి రవిశర్మ, మండా సత్యనారాయణశర్మ, పంతుల గౌరీశంకర్ హాజరయ్యారు. కల్యాణం అనంతరం వధూవరులకు భక్తులు కానుకలు చదివించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ భీమిలి ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ దర్శనం చేసుకుని ఆశీర్వాదం తీసుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మల్లిబాబు, మేకల శ్రీను, పిల్లా రాజేష్ తదితరులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. భీమిలి రోడ్డులోని అపోలో ఫార్మసీ ఎదురుగా గల భవనంలో అర్చకుడు సోమయాజుల కల్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో, కొండపేట శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు భోగాపురపు కార్తికేయ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యస్వామికి వేడుకగా కల్యాణం జరిపించారు.

పద్మనాభం: మండలంలోని కోరాడ పంచాయతీ గెద్దపేటలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సహిత లక్ష్మీగణపతి ఆలయంలో సోమవారం కల్యాణం ఘనంగా నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, అభిషేకాలు, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలకు వేద పండితులు వైభవంగా కల్యాణం నిర్వహించారు.

పీఎం పాలెం: స్థానిక ఆఖరు బస్టాపు నుంచి బక్కన్నపాలెం రోడ్డులో గల శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. షష్టిని పురస్కరించుకుని భక్తులు రాహు కేతు పూజలు చేశారు. సాయంత్రం 6 గంటలకు కల్యాణం కనులపండువగా జరిపారు. మఠం గౌరవ ధర్మాధికారి జగర్లపూడి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్


జీవీఎంసీ 7వ వార్డు మల్లయ్యపాలెంలో కరపత్రాలు అందజేస్తున్న శ్రీనివాసరావు, తదితరులు


సంతపేటలో సర్వేలో వైఎస్సార్‌సీపీ నాయకులు

మధురవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చి ఎంతో మేలు చేశారని జీవీఎంసీ 7వ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి పోతిన శ్రీనివాసరావు అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం జీవీఎంసీ 7వ వార్డు 60వ నంబరు సచివాలయం పరిధిలోని మల్లయ్యపాలెంలో సోమవారం సాయంత్రం నిర్వహించారు. వార్డు జేసీఎస్ కన్వీనర్ కుడితి రామారావు, ఇతర నాయకులతో కలిసి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల బోర్డులు, వైఎస్సార్‌సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ జనవరి 1 నుంచి రూ.3వేల పింఛన్ అందించనున్నామని తెలిపారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ కొనసాగాలంటే సీఎం జగనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రతీ చిన్న పనికీ జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగి విసిగిపోయిన విషయం అందరికీ గుర్తుందని చెప్పారు. అటువంటి వారికి మళ్లీ తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు అల్లాడ లింగేశ్వరరావు, రామారావు, కె.సూరిబాబు, అల్లాడ వెంకటరావు (ఎర్రిబాబు), పిళ్లా సూరిబాబు, డాక్టర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి ప్రజల్లో ఆదరణ

తగరపువలస: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో మంచి ఆదరణ ఉందని రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ శీరపు అప్పలరెడ్డి అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం వైఎస్సార్ సీపీ వార్డు ప్రధాన కార్యదర్శి చిప్పాడ వెంకటేష్ తదితరులతో కలిసి ఆదర్శనగర్ – 1 సచివాలయం పరిధిలోని సంతపేటలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ గడపకు వెళ్లినా 2024లో మళ్లీ జగనే సీఎం కావాలని ప్రజలు కోరుతున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రతి గడపకూ అందాయన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ సరగడ నాగిరెడ్డి, తెడ్లాపు అప్పలరాజు, చేట్ల ఎల్లయ్యరెడ్డి, నీలాపు సురేష్ రెడ్డి, షేక్ గఫూర్, గుజ్జు రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఆదా చేస్తే ఉత్పత్తి చేసినట్టే


గోడపత్రిక ఆవిష్కరిస్తున్న అధికారులు, వినియోగదారులు

ఆనందపురం : వినియోగదారులు విద్యుత్ ఆదా చేస్తే ఉత్పత్తి చేసినట్టేనని జోన్ – 3 మధురవాడ ఈఈ పోలాకి శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కొంత మంది వినియోగదారులు విద్యుత్ వినియోగంపై అవగాహన లేక నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వృథా అవుతోందన్నారు. దీనివల్ల విద్యుత్ కొరత ఏర్పడి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. ఇంట్లో అవసరం లేని సమయంలో ఫ్యాన్లు, లైట్లు ఆర్పివేయాలన్నారు. చాలా గ్రామాల్లో వీధి లైట్లు నిరంతరం వెలుగుతున్నాయని, సకాలంలో ఆర్పివేసి విద్యుత్ పొదుపు చేయాలన్నారు. ఎల్‌ఈడీ బల్బులు వినియోగిస్తే విద్యుత్ వినియోగం చాలా వరకు తగ్గి, బిల్లులు కూడా తగ్గుతాయని వివరించారు. ఈ విషయమై డ్వాక్రా మహిళలు ప్రజలను చైతన్య పరచాలని కోరారు. అనంతరం విద్యుత్ పొదుపుపై రూపొందించిన గోడ పత్రిక ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అడపా లవరాజు, ఏడీఈ కిరణ్ కుమార్, ఏఈ సురేష్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పీఎం పాలెం: సక్రమంగా విద్యుత్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన అవసరమని ఈఈ పోలాకి శ్రీనివాసరావు అన్నారు. విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం పీఎం పాలెంలోని సృజన పాఠశాలలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరం మేరకు మాత్రమే విద్యుత్ వినియోగించాలన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న సీఐ రామచంద్రరావు

ఆనందపురం : వాహనాలు నడిపేవారు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆనందపురం సీఐ కె.రామచంద్రరావు సూచించారు. ఆనందపురం ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీబ్రా లైన్లు ఉన్న చోట ట్రాఫిక్ సూచనలు అనుసరించి రోడ్డు దాటాలన్నారు. ఆటో ముందు భాగంలో కూర్చొని ప్రయాణించరాదన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే నేరమవుతుందని వివరించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో ఎక్కించరాదని, లైసెన్స్ లేకుండా, మద్యం సేవించి ఆటోలు నడిపితే జైలు శిక్షతోపాటు జరిమానా కూడా విధిస్తారని హెచ్చరించారు. అతి వేగం ప్రమాదకరమని, అందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు శివ, సంతోష్, విద్యార్థులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి పీఠంలో ముగిసిన నిత్యాన్నదానం


జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడును సన్మానిస్తున్న స్వాములు

తగరపువలస: భీమిలి మండలం డొంకరపేట రామాలయంలో స్వాములు, శివస్వాములు, భవానీలకు వరుసగా 4వ ఏడాది నిర్వహించిన నిత్యాన్నదానం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాలకు చెందిన మరో 5 వేల మందికి అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అన్నదానానికి సహకరించిన గురుస్వాములు కరుభుక్త ఈశ్వరరావు, గాడు సన్యాసినాయుడు, తుపాకుల పైడిరాజు, గాడు అప్పలనాయుడు, బోని ఈశ్వరరావు, కనకల సూర్యరమణ, సురాల సత్యనారాయణను స్థానికులు సన్మానించారు. పూజా కార్యక్రమాలు నిర్వహించిన అర్చకుడు ఆకెళ్ల భాగ్యరాజా, అతని కుటుంబ సభ్యులు భానుమతి, రోజాలను ఘనంగా సత్కరించారు. అనంతరం గురుస్వాములు భీమిలి జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, సర్పంచ్ గాడు వెంకట నారాయణ, క్వారీ లారీ యజమానుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిల వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, గుద్దాల ఎల్లయ్య, మద్దిల రామునాయుడు, శిరిగిడి చిన్న, శిరిగిడి ఈశ్వరరావు, తుపాకుల అప్పలరాజు, నీలాపు సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీధిలైట్లు వెలిగించాలని వినతి


జెడ్సీ కనక మహాలక్ష్మికి సమస్యలు వివరిస్తున్న అర్జీదారులు

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డులోని మారికవలస ఆర్‌జీకే కాలనీ, అయ్యప్పనగర్‌లో వీధిలైట్లు వెలగడం లేదని, వాటిని వెలిగించి చీకట్లు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని శంకరరావు, రవీంద్రరావు, తదితరులు కోరారు. ఈ మేరకు మధురవాడ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఫిర్యాదు చేశారు. జెడ్సీ కనక మహాలక్ష్మి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జీవీఎంసీ 8వ వార్డు 53వ నంబరు సచివాలయంలో ఓ ఉద్యోగి కృష్ణానగర్ లే అవుట్‌లోని కొన్ని ప్లాట్లకు అనుమతి లేదని భయపెడుతూ, సొమ్ము చెల్లిస్తే వాటిపై ఫిర్యాదు లేకుండా చూస్తామని అవినీతికి పాల్పడుతున్నాడని స్థానికులు వాపోయారు. కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు ఇచ్చామని, అతనిపై చర్యలు చేపట్టాలని కృష్ణానగర్ రెసిడెన్షియల్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. జీవీఎంసీ 5వ వార్డు జీసీసీ లే అవుట్‌లో ఇళ్లకు కుళాయిల ద్వారా నీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని రామారావు కోరారు. మొత్తంగా 9 అర్జీలు వచ్చాయని, పరిశీలించి చర్యలు చేపడతామని జెడ్సీ హామీ ఇచ్చారు. సూపరింటెండెంట్ అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం: స్థానిక జోనల్ కార్యాలయంలో జెడ్సీ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందనకు ఒక్క వినతి వచ్చింది. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించిన వినతి రావడంతో పరిశీలించి చర్యలు తీసుకుంటామని జెడ్సీ తెలిపారు.

యువకుడికి తీవ్ర గాయాలు

కొమ్మాది: బీచ్‌రోడ్డులో జరిగిన ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. విశాఖకు చెందిన విజ్ఞేష్ సోమవారం ఉదయం స్నేహితులను కలిసేందుకు భీమిలి వెళ్లారు. తిరిగి వస్తుండగా ఐఎన్ఎస్ కళింగ వద్ద బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ క్రమంలో బైక్ ఓ చోటుకు, విజ్ఞేష్ మరో చోటుకు ఎగిరిపడ్డారు. అటుగా వెళ్తున్న కొందరు గుర్తించి రుషికొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

వెలమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మధురవాడ: మధురవాడలోని గ్రేటర్ విశాఖ వెలమ సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆవిష్కరించారు. ఆ సంఘ అధ్యక్షుడు చలుమూరి నాయుడుబాబు ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు మాడుగులలోని డిప్యూటీ సీఎం కార్యాలయంలో సోమవారం ఆయనను కలిశారు. ఈ మేరకు సంఘ కార్యకలాపాలు వివరించి, సామాజికవర్గం అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి దొగ్గ దుర్గాప్రసాద్, కోశాధికారి సిరపరపు గౌరీశంకర్, ఉపాధ్యక్షులు రంధి నాయుడు, సూరెడ్డి సత్యనారాయణ, ద్వారపురెడ్డి కృష్ణ, జాయింట్ సెక్రటరీ మడక ఈశ్వరరావు, యూత్ ప్రెసిడెంట్ దొగ్గ గణేష్, పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి అభినందనలు


రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైన సనతో ఉపాధ్యాయులు

పద్మనాభం: పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న వి.సన రాష్ట్ర స్థాయి టెన్నీకాయిట్ పోటీలకు ఎంపికై ంది. లంకెలపాలెంలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి టెన్నీ కాయిట్ పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. క్రీడాకారిణి సనను పాఠశాలలో హెచ్‌ఎం అబ్బూరి బాలామణి, పీడీ కె.నారాయణమ్మ, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

బడ్డీల యజమానుల మధ్య వివాదం


రజక సంతపేటలో వివాదానికి కారణమైన బడ్డీలు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు రజక సంతపేటలో రెండు బడ్డీల యజమానుల మధ్య వివాదం చిలికిచిలికి గాలివానలా మారింది. ఈ వివాదం కారణంగా చోడి ఆదిలక్ష్మి అనే మహిళ సోమవారం సాయంత్రం శరీరంపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. ఈ ప్రయత్నంలో ఆమె నోట్లోకి పెట్రోల్ వెళ్లడంతో సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో చికిత్సకు తరలించారు. వివరాల్లోకి వెళ్తే... బాధితురాలు ఆదిలక్ష్మి ఇటీవల భీమిలి రోడ్డులో పకోడి, తదితర తినుబండారాలు విక్రయించుకునేందుకు బడ్డీ ఏర్పాటు చేసుకుంది. అదే గ్రామానికి చెందిన అదపాక ఉష అనే మహిళ ఆమె బడ్డీని ఆనుకుని మరో బడ్డీ ఏర్పాటు చేసుకుంది. ఈ బడ్డీ కారణంగా పకోడీ బడ్డీకి ఇబ్బందిగా ఉందని ఆదిలక్ష్మి సోమవారం కలెక్టరేట్, జీవీఎంసీ కార్యాలయంలోని స్పందనలో ఫిర్యాదు చేసింది. అనంతరం అక్కడి నుంచి ఇంటికి వచ్చేలోగా ఉష ఆమె బడ్డీని ఆదిలక్ష్మి బడ్డీకి అడ్డంగా ఉంచింది. ఈ క్రమంలో ఇరువురి మధ్య వివాదం చెలరేగడంతో పక్కనే పాన్‌షాపులో బాటిల్‌తో విక్రయిస్తున్న పెట్రోల్ కొనుక్కున్న ఆదిలక్ష్మి శరీరంపై పోసుకుని మండుతున్న స్టౌ వైపు పరుగులు తీసింది. దీంతో అక్కడే ఉన్న స్థానికులు గమనించి ఆదిలక్ష్మి శరీరంపై నీళ్లు కుమ్మరించారు. కొంత పెట్రోలు నోటి ద్వారా లోపలి వెళ్లిపోవడంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న భీమిలి సీఐ డి.రమేష్ సిబ్బందిని పంపించి విచారిస్తున్నారు.

టౌన్ ప్లానింగ్ సిబ్బంది తీరుతో వివాదాలు

ఇటీవల భీమిలి రోడ్డును ఆక్రమించుకుని పోటీపడి దుకాణాలు వెలుస్తున్నా జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది చోద్యం చూస్తున్నారు. ఒకరికి మద్దతు పలుకుతూ మరొకరిని వేధిస్తూ పరోక్షంగా వివాదాలకు కారణమవుతున్నారు. ఆక్రమణలు తొలగించాల్సిన అధికారులు మామూళ్లు తీసుకుని ప్రమాదాలను ప్రోత్సహిస్తున్నారు. దీంతో తరచూ భీమిలి రోడ్డులో ఆక్రమణదారుల మధ్య గొడవలు జరుగుతున్నాయి.